తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-24-ఫిబ్రవరి-2026 | సంపుటి : 3 | సంచిక : 267 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## ప్రభుత్వ ఉద్యోగులకు

# భారీ భద్రతా కవచం

### కీలక నిర్ణయం తీసుకున్న మంత్రివర్గం

సర్వీసులో ఉన్న ఉద్యోగులు లేదా పెన్షనర్లు మరణించిన కుటుంబాలకు రూ.1.25 కోట్ల ఆర్థిక భరోసా

ప్రీమియం మొత్తం ప్రభుత్వ భారం.. 7.56 లక్షల మందికి లాభం

సింగరేణి, జెన్‌కో తరహాలో అమలు.. 60 ఏళ్లలోపు ఉద్యోగులకు అదనపు సాయం



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించేలా మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకున్నది. ఏదేని కారణాలతో సర్వీసులో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్లు చనిపోతే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేలా ప్రత్యేక పాలసీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతున్నది. వారం రోజుల వ్యవధిలోనే అది కొలిక్కి రానున్నది. మృతుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి రూ. 1.25 కోటి మేర పరిహారం అందేలా ప్రభుత్వం తన సొంత ఖర్చుతో ప్రీమియంను చెల్లించనున్నది. ఈ మేరకు క్యాబినెట్ లోతుగా చర్చించి ఆమోదం తెలిపింది. ఉద్యోగులు, పెన్షనర్లకు ఒక్క రూపాయి కూడా భారం కాకుండా పాలసీపై ఆలోచించినట్లు మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఈ పాలసీ కారణంగా సుమారు 7.56 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

మిగతా 2లో..



## మెట్రో స్వాధీనంపై కేబినెట్ సంచలన నిర్ణయం

- ఎల్ అండ్ టీ నుంచి పూర్తి బాధ్యతల స్వీకరణకు ఆమోదం
- పర్యవేక్షణకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘం
- రూ.2 వేల కోట్ల ఈక్విటీ చెల్లింపు, రూ.13 వేల కోట్ల రుణ బదలాయింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఈరోజు అధికారిక ఆమోదం తెలిపింది. నగర ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో, ఆర్థిక వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. మెట్రో స్వాధీన ప్రక్రియను సమర్థంగా అమలు చేయడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు.

మిగతా 2లో..

## నానక్‌రామ్‌గూడలో హార్ట్‌ఫర్డ్ సాంకేతిక కేంద్రం ప్రారంభం

హైదరాబాద్‌లో విస్తరణకు ప్రపంచ బీమా సంస్థ నిర్ణయం

ఒకటిన్నర లక్ష చదరపు అడుగుల్లో ఆధునిక సదుపాయాలు

1,200 మందికి ఉపాధి అవకాశాలు.. మంత్రి శ్రీధర్ బాబు




2లో

## రైతు సంఘర్షణ సభలో కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు



కలెక్టరేట్ ముట్టడి, వినతిపత్రం అందజేత

సీడ్ పత్తి రైతుల బకాయిల విడుదలకు డిమాండ్

రుణమాఫీ, రైతు భరోసాపై ప్రభుత్వంపై విమర్శలు

**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన రైతు సంఘర్షణ సభలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. సభ అనంతరం రైతుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వడానికి పెద్ద ఎత్తున రైతులతో కలిసి కలెక్టరేట్‌కు బయలుదేరారు. పోలీసుల అనుమతి లేదని గేటుకు తాళం వేయడంతో కవితతో పాటు రైతులు అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సభలో మాట్లాడుతూ నాగర్ కర్నూల్ ఘటనలో చిన్నారి మృతి బాధాకరమని పేర్కొంటూ మౌనం పాటించాలని కోరారు.

మిగతా 2లో..

## పెళ్లి పేరుతో కొత్త తరహా మోసాలు

నిశ్చితార్థం తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలి : పోలీస్ కమిషనర్ సజ్జనార్

ఎమోషనల్ బ్లాక్‌మెయిల్, అదనపు కట్నం డిమాండ్లపై హెచ్చరిక

షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచన

2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ప్రభుత్వ ఉద్యోగులకు

# భారీ భద్రతా కవచం

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం సింగరేణి, తెలంగాణ జెన్‌కో సంస్థల్లో ప్రమాద బీమా పాలసీ అమలవుతున్నదని గుర్తుచేసిన మంత్రి పొంగులేటి... ఇకపైన రాష్ట్రంలోని అన్ని డిపార్టుమెంట్లలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపజేసేలా లోతుగా చర్చించి నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీనికి తోడు 60 సంవత్సరాల వయసులోపు సర్వీసులో ఉన్న ఉద్యోగులు ఏ కారణంతో చనిపోయినా ప్రభుత్వం నుంచి రెగ్యులర్‌గా అందే పింఛనుతో పాటు అదనంగా రూ. 10 లక్షల మేర ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఆర్థిక సాయం అందేలా స్కీమ్‌ను రూపొందిస్తున్నట్లు వివరించారు.



## రైతు సంఘర్షణ సభలో

# కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో కుల వివక్షకు తావు లేకూడదని స్పష్టం చేశారు. జోగులాంబ అమ్మవారిపై తనకు ప్రత్యేకమైన భావోద్వేగం ఉందని, భవిష్యత్ కార్యక్రమాలను గద్వాల్ నుంచే ప్రారంభిస్తామని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్రను గుర్తుచేసి, రాబోయే సామాజిక ఉద్యమంలో కూడా వారు ముందుండాలని విజ్ఞప్తి చేశారు. సీడ్ పత్తి రైతుల బకాయిలు వారం రోజుల్లో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, లేదంటే దీక్షకు దిగుతామని హెచ్చరించారు. అర్ధరాత్రి కరెంట్ సరఫరా, యూరియా కొరత, యాప్ ద్వారా బుకింగ్ వంటి అంశాలపై ప్రభుత్వాన్ని విమర్శించారు. రైతుల రుణమాఫీ విషయంలో పూర్తి న్యాయం జరగలేదని, ఇంకా 15 లక్షల మంది రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రతి రైతుకు రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కృష్ణమ్మ, తుంగభద్ర నదులు ప్రవహిస్తున్నా నడిగడ్డకు నీళ్లు అందడం లేదని, తుమ్మిళ్ల, నెట్టెంపాడు పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ ప్రాంతానికి న్యాయం చేయలేక పోయాయని అన్నారు. రైతుల కోసం పోరాడే నాయకత్వం అవసరమని, త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో జాగృతి బలంగా పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు, మహిళల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానని కవిత తెలిపారు.



# దమ్మాయిగూడలో జనసేనలో చేరికలు

**మేడ్చల్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ నియోజకవర్గం దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడ ప్రాంతంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు పార్టీలో చేరారు. జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక యువ నాయకుడు బీరం సాంబ శివ రెడ్డి తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి అధికారికంగా జనసేన పార్టీలో చేరారు. పార్టీ నాయకులు ఆయనకు కండువా కప్పి స్వాగతం పలికారు. సంపత్ నాయక్, శివా రెడ్డి పరిచయంతో ఈ చేరికలు జరిగాయని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రామ్ తాళ్లూరి మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత ముందుకు రావడం ఆనందకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే నాయకులకు పార్టీ ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. బీరం సాంబ శివ రెడ్డి వంటి యువ నాయకుల చేరికతో దమ్మాయిగూడ డివిజన్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.కే సాగర్, రాష్ట్ర నాయకులు సంపత్ నాయక్, కత్తి సైదులు, హైదరాబాద్ నాయకులు సర్వేశ్వర్ రావు, సాయి కుమార్, రమేష్, వీర మహిళలు పద్మజ, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున యువత, స్థానిక ప్రజలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు.



- రామ్ తాళ్లూరి ఆధ్వర్యంలో కార్యక్రమం
- బీరం సాంబ శివ రెడ్డి అనుచరులతో చేరిక
- యువత చేరికతో పార్టీ బలోపేతం

## మెట్రో స్వాధీనంపై కేబినెట్ సంచలన నిర్ణయం




(మొదటి పేజీ తరువాయి)

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులను సభ్యులుగా నియమించారు. ఈ ఉపసంఘం ఆర్థిక, న్యాయ, పరిపాలనా అంశాలను పరిశీలిస్తూ స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించనుంది.
గత సంవత్సరం జరిగిన సూత్రప్రాయ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా చెల్లించడంతో పాటు, సుమారు రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అప్పటినుంచి దశలవారీగా కొనసాగుతోంది. మెట్రో ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, సేవలను మరింత సమర్థంగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర రవాణా రంగంలో దీర్ఘకాలిక ప్రణాళికల అమలు, విస్తరణ ప్రాజెక్టుల వేగవంతం, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్గాలు వెల్లడించాయి. మెట్రో స్వాధీనం అనంతరం సేవల నాణ్యత, నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి ఫోటోపై చర్చ



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫోటో కూడా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటో ఏర్పాటు అంశంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేస్తూ, డిప్యూటీ సీఎం ఫోటో ఉండటంలో తప్పేమీ లేదని వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. సుప్రీంకోర్టు వ్యాఖ్యలతో రాష్ట్రాల్లో ఉప ముఖ్యమంత్రుల అధికారిక ప్రాధాన్యతపై కొత్త చర్చ మొదలైంది. ఇదే నేపథ్యంలో తెలంగాణలోని ప్రభుత్వ కార్యాలయాల్లో భట్టి విక్రమార్క ఫోటో కూడా ఏర్పాటు చేయాలనే ఆలోచనకు వేగం వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. క్యాబినెట్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించే అవకాశముందని సమాచారం. ప్రభుత్వ పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని ఫోటో ఏర్పాటు చేయాలనే అభిప్రాయం కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయంపై తుది స్పష్టత క్యాబినెట్ చర్చల అనంతరం వెలువడే అవకాశముంది. రాష్ట్ర రాజకీయాల్లో ఈ అంశం మరోసారి చర్చకు దారి తీస్తోంది.

- రేవంత్ రెడ్డి ఫోటోతో పాటు భట్టి విక్రమార్క ఫోటో ప్రతిపాదన
- సుప్రీంకోర్టు వ్యాఖ్యల అనంతరం రాజకీయ చర్చ
- క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం సాధ్యమా?

## నానక్‌రామ్‌గూడలో

# హార్ట్‌ఫర్డ్ సాంకేతిక కేంద్రం ప్రారంభం

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



నానక్‌రామ్‌గూడలో హార్ట్‌ఫర్డ్ ఇండియా సాంకేతిక కేంద్రాన్ని సోమవారం మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ప్రపంచ బీమా రంగంలో ప్రముఖ సంస్థగా గుర్తింపు పొందిన హార్ట్‌ఫర్డ్ హైదరాబాద్‌ను తమ సాంకేతిక, ఆవిష్కరణ విస్తరణకు ఎంచుకోవడం తెలంగాణకు గర్వకారణమని పేర్కొన్నారు. సుమారు ఒకటిన్నర లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కేంద్రం 1,200 మంది నిపుణులను సమర్థంగా పనిచేయించగల సామర్థ్యంతో రూపుదిద్దుకుంది. ఈ పెట్టుబడి రాష్ట్ర సమాచార సాంకేతిక రంగానికి మరింత బలాన్ని అందిస్తుందని మంత్రి వివరించారు. ప్రపంచ స్థాయి సంస్థలు తెలంగాణ సమాచార సాంకేతిక వాతావరణంపై పెరుగుతున్న నమ్మకాన్ని ఈ కేంద్రం ప్రతిబింబిస్తోందన్నారు. నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ముందుచూపు విధానాలు, సమగ్ర మౌలిక వసతులు రాష్ట్రాన్ని సాంకేతిక రంగంలో అగ్రగామిగా నిలబెడుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా వేగంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఇలాంటి పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణ సమాచార సాంకేతిక రంగాన్ని మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# పెళ్లి పేరుతో కొత్త తరహా మోసాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** పెళ్లి పేరుతో జరుగుతున్న కొత్త తరహా మోసాలు నగరంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. కేవలం ప్రేమ వ్యవహారాల్లోనే కాకుండా, పెద్దలు కుదిర్చిన సంబంధాల్లో కూడా యువతులు మోసపోతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. నిశ్చితార్థం జరిగిన తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసగాళ్లు తమ పంథాను మార్చుకున్నారని ఆయన తెలిపారు. ముందుగా సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, నిశ్చితార్థం జరిపించుకుని విశ్వాసం పొందుతున్నారని చెప్పారు. ఆ తర్వాత పెళ్లి ఖాయమైందన్న చనువును ఆసరాగా చేసుకుని యువతులతో సన్నిహితంగా మెలిగి, మాయమాటలతో ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తూ శారీరకంగా లోబరుచుకునే ఘటనలు నమోదవుతున్నాయని వెల్లడించారు. పెళ్లి సమయం దగ్గర పడిన తర్వాత అదనపు కట్నం కోరుతూ, ఇవ్వకపోతే పెళ్లి రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. సమాజంలో పరువు పోతుందనే భయంతో చాలా మంది బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని, ఈ మౌనాన్ని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు మరింతగా రెచ్చిపోతున్నారని షీ టీమ్స్ గుర్తించాయని చెప్పారు. నిశ్చితార్థం జరిగినంత మాత్రాన గుడ్డిగా నమ్మకుండా, అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై ముందుగానే ఆరా తీయాలని సూచించారు. ముఖ్యంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం కోసం ఒత్తిడి చేస్తే అది ప్రమాద సంకేతమని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలకు గురైన వారు భయపడకుండా ముందుకు రావాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని కమిషనర్ భరోసానిచ్చారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు లేదా అత్యవసరంగా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






## రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించిన పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు )

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన ఖమ్మం కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. ముందుగా పతాకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులు పోలీస్ కమిషనర్ కార్యాలయం ఒక్కొక్కరిని ప్రత్యేకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఖమ్మం కమిషనరేట్ పోలీస్ క్రీడాకారులు రాష్ట్రాస్థాయిలో క్రీడల్లో అద్భుత ప్రదర్శనతో 15 బంగారు పతకాలు, 8 రజిత పతకాలు, 16 కాంస్య పతకం మొత్తం 39 పతకాలను కైవసం చేసుకోవడం అభినందనీయమని పోలీస్ కమిషనర్ అన్నారు. ఇదేస్ఫూర్తితో భవిష్యత్‌లో జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభను కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పతకాలను సాధించేందుకుగా ముమ్మరంగా సాధన చేయాలని, క్రీడల్లో రాణించే వారికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పోలీస్ కమిషనర్ అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి,అడిషనల్ డీసీపీ విజయబాబు,ఏ ఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐలు సురేష్, సాంబశివరావు, క్లూస్ టీం ఇన్స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు



## పాత ఎన్‌టీఆర్ కాలువ పూడ్చి నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

- సత్తుపల్లి డీఈఈకు సీపీఐ(ఎం) వినతి

సత్తుపల్లి, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):

మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామం సమీపంలో పడావుగా ఉన్న పాత ఎన్‌టీఆర్ కాలువను సింగరేణి మట్టితో పూడ్చి, సొంతింటి స్థలం లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ(ఎం) పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం సత్తుపల్లి డీఈఈ టి. సతీష్‌కు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ఎనిమిది నెలలుగా కాకర్లపల్లి గ్రామ పంచాయతీ నుంచి జిల్లా స్థాయి వరకు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. పాత కాలువను సింగరేణి మట్టితో పూడ్చేందుకు అనుమతి ఇచ్చి, ఆ భూమిని పేదలకు ఇంటి స్థలాలుగా కేటాయించాలని కోరారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఐనంపూడి సనందనరావు, కువ్వారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, తడికమళ్ల రామకృష్ణ, బెజవాడ లక్ష్మీనారాయణ, దాట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## సరస్వతి నగర్ కాలనీ అధ్యక్షునిగా వనం జయరాజు రెండోసారి ఎన్నిక

నాచారం, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ లో బాపూజీ నగర్ మరియు సరస్వతి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా వనం జయరాజు రెండవ సారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.సత్కార కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సహకారంతో సరస్వతి నగర్ కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేసిన ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.అదే విధంగా కాలనీలో ఖాళీగా ఉన్న స్థలాన్ని వినియోగంలోకి తెచ్చి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఉపయోగకరంగా మార్చినట్లు తెలిపారు.మరోసారి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన వనం జయరాజు కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమంతరావు, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, రోహిత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల 'ఛలో హైదరాబాద్' ఉద్రిక్తం

- తీవ్ర నిర్బంధాల మధ్య కోటి కమిషనర్ కార్యాలయం ముట్టడి

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):






రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్లు ఇచ్చిన "ఛలో హైదరాబాద్" పిలుపు ఉద్రిక్తంగా మారింది. జనవరి నెల పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలని, రూ.18,000 ఫిక్స్డ్ వేతనం అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ కోటి కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించింది.ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాలు అమలు చేసినట్లు యూనియన్ నాయకులు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఆశా వర్కర్లను ముందస్తుగా అరెస్టులు చేసి, హైదరాబాద్‌కు రాకుండా అడ్డుకున్నారని తెలిపారు. నగరాని కి చేరుకున్న వారిని కూడా పోలీసులు వెతికి అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. కొందరి సెల్‌ఫోన్లు పరిశీలించి వాట్సాప్ గ్రూప్ సందేశాలు చూపించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపించారు.అయినా వేలాదిమంది ఆశా వర్కర్లు కోటి ప్రాంతంలోని ఆంధ్రాబ్యాంక్ గల్లీలోని 1204 మెట్రో పిల్లర్ వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి కమిషనర్ కార్యాలయానికి చేరుకునే ప్రయత్నం చేశారు. నాలుగు రహదారుల సిగ్నల్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో పలువురు ఆశా వర్కర్లు గాయపడినట్లు సమాచారం. కొందరి బట్టలు చినిగిపోవడంతో పాటు కొందరు సొమ్మసిల్లి పడిపోయారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు వేలాదిమంది ఆశా వర్కర్లు కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమస్యలు పరిష్కరించమని అడిగితే అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని నాయకులు విమర్శించారు. సమస్యలు వినడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా లేదని, ఇది ప్రజా పాలన కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకుని తక్షణమే చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని ఆశా యూనియన్ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. నీలాదేవి, రాష్ట్ర కోశాధికారి పి. గంగమణి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాయిపల్లి, యాదగిరిపల్లిలో సీసీ రోడ్లు యూజీడీ పనుల పరిశీలన

- కీసర డివిజన్-1లో అభివృద్ధి పనులను పరిశీలించిన నాయకులు, అధికారులు
- పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు

కీసర, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు)

మల్కాజ్గిరి కార్పొరేషన్ పరిధి లోని కీసర డివిజన్ 1లో తిమ్మాయిపల్లి, యాదగిరిపల్లి వార్డుల్లో కొనసాగుతున్న సీసీ రోడ్ల నిర్మాణంలో భాగంగా యూజీడీ పనులను సంబంధిత అధికారులు, నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా డివిజన్ 1 నాయకులు రామిడి విజయ రెడ్డి, ఏఈ అఖిల్ చాహన్, వర్క్ ఇన్స్పెక్టర్ భాస్కర్ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు.కీసర మున్సిపాలిటీ డీసీ వసంత, డీఈఈ మాధవ చారి మాట్లాడుతూ, అభివృద్ధి పనులు సమయానికి పూర్తవడం అత్యంత ముఖ్యమని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తిమ్మాయిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు సురేష్‌గౌడ్, యాదగిరిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు హరిబాబు గౌడ్ తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.



# జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి 150 ఫిర్యాదులను స్వీకరణ

మేడ్చల్ మల్కాజ్గిరి, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులను జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి మొత్తం 150 దరఖాస్తులను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియలతో కలిసి అదనపు కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ఎంతో వ్యయప్రయాసలతో అధికారులను ఆశ్రయిస్తారని, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం ప్రతి అధికారిపై ఉన్న బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును వెంటనే సంబంధిత శాఖలకు పంపించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో కారణాలను స్పష్టంగా అర్జీదారులకు తెలియజేయాలని, స్వీకరించిన అర్జీలపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పీఆర్‌పీ, పే అబ్రిడేషన్ సమస్యలపై మెమోరాండం

- సింగరేణి సీఎండీకి అధికారుల వినతి

సత్తుపల్లి, ఫిబ్రవరి 23(తెలంగాణ ముచ్చట్లు):

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ, పే అబ్రిడేషన్ సమస్యలను పరిష్కరించాలంటూ సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు మెమోరాండం అందజేశారు. సత్తుపల్లి జీఎం చింతల శ్రీనివాస్ ద్వారా ఈ వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ జేవిఆర్ ఓసీ ఎన్వీఆర్ ప్రహ్లాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కిష్టారం సునీల్ వర్మ, ప్రాజెక్ట్ ఇంజనీర్ జేవిఆర్ ఓసీ డి. శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ ఇంజనీర్ కిష్టారం ఓసీ జి.వి. రావు, జేవిఆర్ ఓసీ మేనేజర్ బి. రాజేశ్వరరావు, కళ్యాణ్ రామ్, కిష్టారం ఓసీ మేనేజర్ రామకృష్ణ, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, ట్రెజరర్ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఎంపీపీఎస్ కీసర పాఠశాలలో డీఈఓ విజయకుమారి ఆకస్మిక తనిఖీలు

- ఎఫ్ఎల్ఎన్, ఓఆర్ఎఫ్ అమలుపై ప్రత్యేక దృష్టి

కీసర, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):





మేడ్చల్ జిల్లా డిస్ట్రిక్ట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈఓ) విజయకుమారి కీసర మండలంలోని ఎంపీపీఎస్ కీసర పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) అమలు తీరును, పఠనా నైపుణ్యాలను, ఓరల్ రీడింగ్ ఫ్లూయెన్సీ (ఓఆర్ఎఫ్) స్థాయిలను సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన ఆమె విద్యార్థులతో నేరుగా మాట్లాడి చదవడం, అర్థం చేసుకోవడం, గణిత సమస్యలు పరిష్కరించడం వంటి అంశాల్లో వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల నేర్చుకునే స్థాయిని బట్టి బోధన పద్ధతులను అనుసరించాలని ఉపాధ్యాయులకు సూచించారు.బోధనలో నాణ్యత పెంపు ద్వారా ప్రతి విద్యార్థి కనీస నేర్చుకునే లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనలో పాఠ్య ప్రణాళిక రూపకల్పన, నిరంతర మూల్యాంకనం, వ్యక్తిగత శ్రద్ధ, పునర్విమర్శ తరగతులు కీలకమని తెలిపారు. ఓఆర్ఎఫ్ ఫలితాలను మెరుగుపరచేందుకు రోజువారీ పఠనాభ్యాసాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. పాఠశాల హాజరు, శుభ్రత, విద్యా వాతావరణంపై కూడా డీఈఓ సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయులు కృషి చేసి విద్యార్థులను విద్యలో మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆమె ఆకాంక్షించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# కాప్రా ప్రెస్ క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- **జర్నలిస్టుల హక్కులు, సంక్షేమమే లక్ష్యం : అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి**

**కుషాయిగూడ, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ కాప్రా ప్రెస్ క్లబ్ (ఎలక్ట్రానిక్ మీడియా) నూతన కమిటీని సోమవారం టీఎస్ఐఐసీ కాలనీలోని క్లబ్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జర్నలిస్టుల సమక్షంలో జరిగిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన అధ్యక్షుడిగా రోండ్ల ప్రభాకర్ రెడ్డి (బబ్బి) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గాదె రాము గుప్తా, కోశాధికారిగా నమ్ముల రమేష్ యాదవ్ ఎంపికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా అమరేందర్, సత్యం; ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, (టింకు) బసంత్ రెడ్డి; కార్యనిర్వాహక అధ్యక్షులుగా నటరాజ్, దాచారం రమేష్ బాధ్యతలు చేపట్టనున్నారు. గౌరవ అధ్యక్షులుగా రామారం సుధీర్ గౌడ్, గుండ్ల గోపాల్ గౌడ్; ప్రధాన సలహాదారులుగా శనిగరం అశోక్, నరసింహ రెడ్డి నియమితులయ్యారు.కార్యనిర్వాహక సభ్యులుగా మసైయ్య గౌడ్, రమేష్ గౌడ్, ప్రసాద్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తానని, ఎలాంటి సమస్యలు ఎదురైనా ముందుండి పోరాడతానని హామీ ఇచ్చారు. కాప్రా ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. సమావేశంలో పలువురు జర్నలిస్టులు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.



# సీఎం కప్ సబ్ జూనియర్ ఫుట్‌బాల్‌లో మేడ్చల్ జిల్లా విజయం

- **గచ్చిబౌలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా నిర్వహించిన సీఎం కప్-2025 రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో మేడ్చల్ జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల జట్లు పాల్గొని ఉత్కంఠభరితంగా పోటీపడ్డాయి.ప్రారంభం నుంచే మేడ్చల్ జిల్లా ఆటగాళ్లు దూకుడుగా ఆడి ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయించారు. సమన్వయం, క్రమశిక్షణ, వేగవంతమైన దాడులతో ప్రతి మ్యాచ్‌లోనూ మెరుగైన ప్రదర్శన కనబరిచారు. ఫైనల్ మ్యాచ్‌లోనూ అదే ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ట్రోఫీని కైవసం చేసుకున్నారు.జట్టు కోచ్‌లు రూపొందించిన వ్యూహాలు, ఆటగాళ్ల పట్టుదల ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. విజేత జట్టును అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, తల్లిదండ్రులు అభినందించారు.రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన మేడ్చల్ జిల్లా జట్టు భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ చాటాలని క్రీడాభిమానులు ఆకాంక్షించారు.



# బస్తీబాటతో సమస్యల పరిష్కారానికి శ్రీకారం నెమలి అనిల్ కుమార్

- **మల్లాపూర్‌లో ప్రజలతో నేరుగా భేటీ తక్షణ చర్యలకు ఆదేశాలు**

**మల్లాపూర్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ చేపట్టిన బస్తీబాట కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందనను రాబడుతోంది. బస్తీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు ప్రారంభిస్తున్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ లీకేజీలు, విద్యుత్ అంతరాయాలు, పారిశుద్ధ్య లోపాలు వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. ప్రతి సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల మాటే మార్గదర్శకంగా తీసుకుని సేవా భావంతో ముందుకు సాగుతున్నామని నెమలి అనిల్ కుమార్ పేర్కొన్నారు.బస్తీబాట కార్యక్రమం కేవలం రాజకీయ పరిమితుల్లో కాకుండా, ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో నిర్వహిస్తున్న కార్యక్రమమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.






# మౌలాలి సర్కిల్‌లో ఎంఎంసీ కార్మికుల ధర్నా

- **జీతాలు వెంటనే చెల్లించాలి**
- **వేధింపులు అరికట్టాలి అంటూ డిమాండ్**

**మౌలాలి, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్గిరి నియోజకవర్గం మౌలాలి సర్కిల్‌లోని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మున్సిపల్ వర్కర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ 2026 జనవరి నెలకు సంబంధించిన జీతాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వేతనాల ఆలస్యంతో కుటుంబాల పోషణ కష్టసాధ్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో అమలులో ఉన్న వారాంతపు సెలవులు, పండుగ సెలవులను నిలిపివేయడం అన్యాయమని, దీంతో కార్మికులు శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా, సర్కిల్ పరిధిలో కొంతమంది సూపర్వైజర్ల వేధింపులు పెరిగాయని ఆరోపిస్తూ వాటిని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని కోరుతూ, తమ డిమాండ్లు నెరవేరనిచో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి

- **ఎస్సై జగదీష్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 23(తెలంగాణ ముచ్చట్లు)**




రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని తిరుమలయాపాలెం ఎస్సై జగదీష్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన'అరైవ్ అలైవ్' రెండోవ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈరోజు తిరుమలాయపాలెం మండలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలపై పోలీస్ శాఖ దృష్టి ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు శిక్షలతో పాటు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.





# ఈసీఐఎల్ సర్కిల్ వద్ద హెల్మెట్ అవగాహన కార్యక్రమం

- **"అరైవ్ అలైవ్ – 2026 ఫేజ్–2"లో భాగంగా కుషాయిగూడ పోలీసుల చైతన్య కార్యక్రమం**

**కుషాయిగూడ, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్-2026 - ఫేజ్ 2" కార్యక్రమంలో భాగంగా, ఈసీఐఎల్ సర్కిల్ వద్ద ప్రత్యేక హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుషాయిగూడ పీఎస్ ఎస్సై ఎం. విజయ్ మరియు పోలీస్ సిబ్బంది హాజరై ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఎస్సై విజయ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలే ప్రధాన కారణమని, నాణ్యమైన (ఐఎస్ఐ మార్క్) హెల్మెట్ ధరించడం ద్వారా 60% నుంచి 70% వరకు ప్రాణాపాయం తగ్గించవచ్చని తెలిపారు.అలాగే కేవలం వాహనం నడిపే వ్యక్తి మాత్రమే కాకుండా, పిలియన్ రైడర్ కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన చట్టపరమైన బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానాలు విధించబడతాయని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సుమారు 60 నుంచి 70 మంది ద్విచక్ర వాహనదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది హెల్మెట్‌ను సరైన విధంగా ధరించే పద్ధతిని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించడమే కాకుండా, ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో కుషాయిగూడ పోలీసులు తమ కట్టుబాటును తెలియజేశారు.

# సేవా పథంలో 20వ వార్డ్ కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు

- **విద్యార్థులకు అండగా, దివ్యాంగులకు తోడుగా..**
- **వార్డు అభివృద్ధికి, పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత..**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు)**



సోమవారం 20వ వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి, ఉండ్రు శ్యాంబాబు ఆధ్వర్యంలో మానవత్వంతో కూడిన ఒక గొప్ప సేవా కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ "
**డాక్టర్ కాపా చంద్రకళ",**
"డాక్టర్ కాపా మురళీకృష్ణ సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా సాగింది.

**విద్యార్థులకు ప్రోత్సాహం:**
వైరా మున్సిపాలిటీ శాంతినగర్ ఎస్టి కాలనీ తండాలోని ఎం పిపిఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల బ్యాగులను పంపిణీ చేశారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు విద్యే మార్గమని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

దివ్యాంగులకు ఊతం: నడవలేని స్థితిలో ఉన్న కేలోత్ చంద్రు అనే దివ్యాంగుడికి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు వీల్ చైర్‌ను అందజేశారు.

అభివృద్ధిపై హామీ: ఈ సందర్భంగా" డాక్టర్ కాపా మురళీకృష్ణ "మాట్లాడుతూ.. రాబోయే ఐదు సంవత్సరాల కాల పరిధిలో 20వ వార్డును ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మరియు వార్డు అభివృద్ధి కొరకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని ప్రకటించారు.

ముఖ్య అతిథులు పాల్గొన్న వారు:
ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ రామకృష్ణ రెడ్డి తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వంకాడోత్ బిక్య, గుగులోత్ లక్ష్మీ బాయి, ఎస్ కె. రహీం (పండు), తేజావత్ నాగేశ్వరరావు, గడసందుల దర్గయ్య, కొర్ర వెంకటేశ్వర్లు, బానోత్ కృష్ణ బాబు, తేజవత్ బాలమ్మ, వంకాడోత్ మని, భూక్యా లక్ష్మి తదితరులు ఈసేవలో భాగస్వాములయ్యారుపేదల సేవయే పరమావధిగా.. వార్డు అభివృద్ధే లక్ష్యంగా మా ప్రయాణం సాగుతుంది.

# 2025–26 ఉపకార వేతనాలపై కీలక ప్రకటన

- **బీసీ, ఈబీసీ విద్యార్థుల దరఖాస్తులు త్వరగా సమర్పించాలి**

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఉపకార వేతనాల (ఎంటిఎఫ్) మంజూరికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ మరియు ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్ తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన బీసీ మరియు ఈబీసీ విద్యార్థుల అప్లికేషన్ ఫారాలకు అవసరమైన ధృవీకరణ పత్రాలు జతచేసి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఈ మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి టి. ఝాన్సీ రాణి తెలిపారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.అదేవిధంగా, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం కింద నమోదు చేసుకున్న విద్యార్థుల బ్యాంకు ఖాతాలను ఆధార్ నంబర్‌తో సీడింగ్ చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు.సంబంధిత బ్యాంకు లేదా ఎన్ పి సి ఐ పోర్టల్ (www.npci.org.in) ద్వారా ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) విధానంలో విడుదల చేయనున్నందున ఆధార్ సీడింగ్ మరియు డిబిటి యాక్టివేషన్ తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు.జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్, ఇంజనీరింగ్ మరియు ఇతర కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాలల బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఈ సమాచారం చేరవేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారిణి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం- 24 - ఫిబ్రవరి 2026


# మూడు నెలలకే నూరేళ్లు నింపిన అగ్రకుల ఆధిపత్యం

మూతికి ముంత
ముడ్డికి చీపురి కట్టి
వేల ఏండ్లుగా
సమాజంలో అసమానతలు
సృష్టించి అంటరానివారిగానే
చూస్తిరి.

మనిషి మనిషిని ప్రేమిస్తే
వెంటాడి వేటాడి మార్మంగాల కోసి
చంపేస్తిరి.

ఊరి మధ్యలో గుడి కట్టి
గుళ్ళోకి రానీయకుండా
అవమానిస్తిరి.

తలకెక్కిన కులపిచ్చి పంతుళ్లు
బడిలో నీళ్లు తాగినందుకు
పసిపిల్లల నోట్లో ఉచ్చపోసి
తీరని గాయం చేస్తిరి.

చనిపోయిన గోవును
తీసుకుపోలేదని
దళితుల బట్టలుడదీసి
కొడితిరి.

కళ్ళం లో ధాన్యాన్ని
ముట్టుకున్నదని
వివస్రను చేసి ఊరేగించితిరి

కాసింత భూమి ఉంటే
ఓర్వక
సమాజం తలదించుకునేల
వందలాది ముందల
తల్లి బిడ్డల హత్యచారం చేసి
చంపితిరి.

కారంచేడు చుండూరు
వెంపెంట కైర్లాంజీలు
మా కండ్ల ముందర
కదలడుతూనే ఉన్నాయి.

నిన్నగాక మొన్న
కుమ్మేర గ్రామంలో
కండ్ల కావరమెక్కిన
అగ్రకుల అహంకారానికి
మూడు నెలల పాపకు
నూరేళ్లు నింపారు.

మనుషుల మధ్య
అడ్డుగోడలు సృష్టించిన
మనుస్మృతిని
మంటల్లో తగలబెడదాం

అంటరాని వారు
పెను మంటులు కావాలి
కులం అనే మహమ్మారిని
కూకటి వెళ్ళతో నిర్ములుద్దాం

నాగర్ కర్నూల్ జిల్లాలో కుమ్మేర
గ్రామంలో అగ్రకుల రెడ్ల అహంకారా
నికి మూడు నెలలు కూడ నిండని పసి
పాపని తన్ని చంపిన ఘటన దేశంలోనే
మెదటి సారి మానవ సమాజమం
తా తలదించుకొనెల చేసింద్రు..
కులమె కదా మనుషుల మద్య అస
మానతలు సృష్టిస్తూ అడ్డుగోడలుగా
ఉన్నది.
కులం లేని సమాజాముకై
దేశంలో కులాల నిర్ములన జరగాలి.



–అక్కెనపెల్లి దుర్గేష్

# ఆపదలో ఆదుకునే 108 సిబ్బందికి స్టార్ అవార్డులు

**హనుమకొండ,ఫిబ్రవరి23 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే గుర్తుకొచ్చేది 108 సేవలు. కాల్ వచ్చిన వెంటనే కేవలం 30 సెకండ్లలో బయలుదేరి, 10 నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకుని అత్యవసర వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడడంలో 108 సిబ్బంది ప్రతిభ కనబరుస్తున్నారు.హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని 108 కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ధర్మసాగర్, అయినవోలు, పరకాల మండలాలకు చెందిన 108 సిబ్బందికి స్టార్ అవార్డులు అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో చురుకైన సేవలు అందించి పలువురు ప్రాణాలను కాపాడినందుకు అయినవోలు మండలానికి చెందిన అత్యవసర వైద్య సాంకేతిక నిపుణుడు ఎనుగుల రాజుకు పురస్కారం లభించింది. అదే విధంగా అంబులెన్స్ పైలెట్ తన నైపుణ్యంతో కేవలం పది నిమిషాల్లో రోగిని ఆసుపత్రికి చేర్చినందుకు ప్రశంసలు అందుకుని అత్యుత్తమ కెఎంపీఎల్ అవార్డును పొందారు. పరకాల బృందానికి చెందిన పాముల రాజు, పుట్ట విజయభాస్కర్, ధర్మసాగర్ మండలానికి చెందిన మాచర్ల వెంకటేష్‌లకు కూడా స్టార్ అవార్డులు అందజేశారు. వరంగల్ జిల్లా కార్యక్రమ నిర్వాహకుడు పాటి శివకుమార్, జిల్లా మేనేజర్ మంద శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ అవార్డుల ప్రదానం జరిగింది. కార్యక్రమంలో పలువురు 108 సిబ్బంది పాల్గొన్నారు.



# వేలేరు మండలంలో నర్సింగ్ విద్యార్థుల ఇంటింటి సర్వే

**వేలేరు, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కాజీపేట ఫాతిమా నగర్‌కు చెందిన నర్సింగ్ విద్యార్థులు ఫీల్డ్ విజిట్ భాగంగా వేలేరు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడం, ప్రాథమిక ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ సర్వే చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేలేరు మండల సర్పంచుల వేదిక అధ్యక్షుడు బిల్లా యాదగిరి హాజరై సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో ఆరోగ్యానికి ముఖ్యస్థానం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రీకర్, కుమారస్వామి, ప్రభావతి, కనకమ్మ, ప్రసాద్ తదితర వైద్య సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.






# ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన గిరిజన విద్యుత్ ఉద్యోగులు

**హనుమకొండ, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** గిరిజన విద్యుత్ ఉద్యోగులు తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఎస్టీ అసోసియేషన్ తరపున శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి ఉద్యోగుల సమస్యలను వివరించారు. సంఘం కార్యకలాపాలను ప్రతిబింబించే డైరీను కూడా అందజేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను కూడా కలిసి సంఘం డైరీను అందించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు అజ్మీరా సీతారాం నాయక్ మాజీ ఎంపీ,వాలు నాయక్, కంపెనీ అధ్యక్షుడు హర్జీ నాయక్, కార్యదర్శి అజ్మీర శ్రీరామ్ నాయక్, సహాయ ఇంజనీర్ రవి, తారాచంద్ తదితరులు మరియు పలువురు విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# కార్డు లేకపోయినా నగదు నగదు విత్‌డ్రా.. ఆధార్ ఉంటే చాలు!

**హైదరాబాద్ – ఫిబ్రవరి 23, ( తెలంగాణ ముచ్చట్లు)** డిజిటల్ విప్లవంతో బ్యాంకులకు, నగదు యంత్రాలకు వెళ్లే అవసరం క్రమంగా తగ్గుతోంది. అయినప్పటికీ అత్యవసరంగా నగదు అవసరమైన సమయంలో డెబిట్ కార్డు లేకపోయినా ఇప్పుడు ఆందోళన అవసరం లేదు. కేవలం ఆధార్ గుర్తింపు సంఖ్య లేదా త్వరిత స్పందన సంకేత చిహ్నం సాయంతోనే నగదు పొందే సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

సాంకేతిక అభివృద్ధితో ఏకీకృత చెల్లింపు వ్యవస్థ వినియోగం పెరిగి, నగదు యంత్రాల వద్ద రద్దీ తగ్గింది. అయితే కార్డు మర్చిపోయిన సందర్భాల్లో లేదా కార్డు లేని ఖాతాదారులు కూడా ఇప్పుడు ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం ద్వారా సులభంగా నగదు పొందవచ్చు.




ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం ద్వారా నగదు పొందేందుకు ముందుగా సమీపంలోని సూక్ష్మ నగదు యంత్రం లేదా బ్యాంకు ప్రతినిధి కేంద్రానికి వెళ్లాలి. అక్కడ నగదు ఉపసంహరణ ఎంపికను ఎంచుకుని, ఆధార్ సంఖ్యతో పాటు సంబంధిత బ్యాంకు పేరును నమోదు చేయాలి. అనంతరం వేలిముద్ర ద్వారా గుర్తింపు ధృవీకరణ జరగడంతో లావాదేవీ పూర్తవుతుంది. ప్రక్రియ విజయవంతమైతే వెంటనే నగదు అందుతుంది.

ఇక ఆధార్ మాత్రమే కాకుండా, ప్రస్తుతం అనేక నగదు యంత్రాల్లో ఏకీకృత చెల్లింపు వ్యవస్థ ఆధారిత నగదు సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. యంత్రం తెరపై కనిపించే త్వరిత స్పందన సంకేత చిహ్నాన్ని మొబైల్‌లోని డిజిటల్ చెల్లింపు అనువర్తనంతో స్కాన్ చేసి, ధృవీకరణ పూర్తి చేస్తే కార్డు అవసరం లేకుండానే నగదు పొందవచ్చు.

ఈ విధానాలు గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఉపయోగకరంగా మారాయి. బ్యాంకు శాఖలు దూరంగా ఉన్న చోట్ల కూడా ఆధార్ ఆధారిత సేవలతో ప్రజలు సులభంగా నగదు పొందగలుగుతున్నారు. డిజిటల్ మార్పులతో నగదు లావాదేవీలు మరింత సులభతరం అవుతున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# రజకుల పై దాడులకు పాల్పడిన బాధ్యులను తక్షణమే అరెస్టు చేయాలి

- రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలేపల్లి రాజు (మైఖేల్)

**హన్మకొండ,ఫిబ్రవరి23(తెలంగాణ ముచ్చట్లు):** నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలలో రెండు నెలల బాలికను బలి తీసుకున్న వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రజక సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేపల్లి రాజు (మైకెల్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పాత్రికేయ మిత్రులతో మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలకు పాల్పడిన నిందితులపై హత్య కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని రజక కుటుంబం పై దాడి చేసి రెండు నెలల చిన్నారని బలిగొన్న ఉపేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, తుకారం రెడ్డి, సతీష్‌రెడ్డి లను కఠినంగా శిక్షించాలని రజక కులానికి చెందిన చంద్రకళ కుటుంబం శ్రీ మల్లికార్జున స్వామి దర్శనం చేసుకుని వెళ్ళగా దర్శనం చేసుకోకుండా నిర్వాహకులు చంద్రకళ కుటుంబాన్ని అడ్డుకోగా ఎందుకు అడ్డుకుంటున్నారని అడిగిన చంద్రకళ కుటుంబాన్ని బూతులు తిడుతూ దుర్భాషలాడుతూ అతి కిరాతంగా క్రూరంగా చిన్నారిని కాలుతో తన్నిన దుర్మార్గులను సాంఘిక బహిష్కరణ చేయాలని కోరారు. నిందితులపై కేసు నమోదు చేయకుండా పక్షపాత ధోరణి అవలంబిస్తున్న అక్కడి పోలీసు అధికారులను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని ముఖ్యంగా సీఐ పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# శాంతించిన బంగారం ధరలు, కొనుగోలుకు ఇదే మంచి ఛాన్స్!

పసిడి ప్రియులకు ఈరోజు స్వల్ప ఊరట లభించింది. వరుసగా మూడు రోజుల పాటు పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు ఈరోజు నిలకడగా కొనసాగుతున్నాయి. వెండి ధరలు కూడా మార్పుల్లేకుండా స్థిరంగా ఉండటంతో కొనుగోలుదారులకు ఇది అనుకూల సమయంగా భావిస్తున్నారు. దేశంలో పెళ్లిళ్ల కాలం ప్రారంభం కావడంతో బంగారానికి డిమాండ్ మరింత పెరిగింది. గత కొన్ని రోజులుగా ధరలు వేగంగా పెరగడం వల్ల కొనుగోలుదారుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఈరోజు ధరల పెరుగుదలకు విరామం లభించడం ఉపశమనం కలిగించింది. అంతర్జాతీయ స్థాయిలో పసిడి ధరలు పెరుగుతున్నప్పటికీ దేశీయంగా ఈరోజు స్థిరత్వం కనిపించడం గమనార్హం. రాబోయే రోజుల్లో పరిస్థితులు మారితే ధరలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని బంగారం వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అందువల్ల మరింత పెరుగుదల ప్రారంభమయ్యే ముందు కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయంగా భావిస్తున్నారు. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఈరోజు 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,59,280గా ఉంది. 22 క్యారెట్ల పది గ్రాముల





బంగారం ధర రూ.1,46,000గా కొనసాగుతోంది. గత మూడు రోజుల్లో తులం ధర రూ.4,600కు పైగా పెరిగిన విషయం తెలిసిందే. ఇదే ధోరణి మళ్లీ కొనసాగితే ధరలు మరింత ఎగబాకే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగారంతో పాటు వెండి ధరలు కూడా ఈరోజు స్థిరంగా ఉన్నాయి. కిలో వెండి ధర రూ.2,90,000గా నమోదైంది. అంతర్జాతీయ ప్రభావాలు కొనసాగితే వెండి ధరల్లో కూడా త్వరలో మార్పులు చోటుచేసుకునే అవకాశముందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దీంతో కొనుగోలుదారులు పరిస్థితులను గమనిస్తూ నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

## బెంగళూరుకు బిగ్ షాక్.. మంగళూరుకు వెళ్లిపోతున్న ఐటీ కంపెనీలు

పన్నెండేళ్లుగా సింగపూర్‌లో పనిచేస్తున్న ఇంజనీర్ ఆదిత్య జీవితంలో కీలక మలుపు చోటుచేసుకుంది. అమెరికాకు చెందిన ప్రముఖ ధ్వని పరిష్కారాల సంస్థ అతనికి కొత్త ఉత్పత్తి శ్రేణిని ఆరంభం నుంచి నిర్మించే బాధ్యత అప్పగించింది. అంతేకాకుండా అమెరికా వెలుపల సంస్థ స్థాపించే తొలి యూనిట్‌కు సరైన స్థలాన్ని ఎంపిక చేయాలని సూచించింది. మొదటగా సూచించిన నగరం బెంగళూరు. అయితే అక్కడి రద్దీ రహదారులు, పెరుగుతున్న జీవన వ్యయం, అధిక ఉద్యోగ మార్పిడి వంటి అంశాలు దీర్ఘకాలిక పరిశోధనాభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తాయని ఆదిత్య భావించాడు.

దీంతో ఆయన ప్రత్యామ్నాయంగా కర్ణాటక తీరంలోని మంగళూరును ప్రతిపాదించాడు. సంప్రదాయంగా శుద్ధి కర్మాగారాలు, నౌకాశ్రయం, మత్స్యకార రంగం, వ్యవసాయం చుట్టూ తిరిగిన ఈ ప్రాంతం ఇప్పుడు సమాచార సాంకేతిక రంగానికి కొత్త కేంద్రంగా అవతరిస్తోంది. తక్కువ రద్దీ, పరిశుభ్రమైన వాతావరణం, సమతుల్య జీవనశైలి వంటి అంశాలు నిపుణులను ఆకర్షిస్తున్నాయి. 2024 నవంబర్‌లో సామాజిక వృత్తిపర వేదిక ద్వారా నియామక ప్రక్రియ ప్రారంభమై, ఇతర నగరాల్లో పనిచేస్తున్న మంగళూరు-ఉడిపి ప్రాంత నిపుణులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. కుటుంబానికి దగ్గరగా ఉండే అవకాశం, కొత్త ఉత్పత్తి రూపకల్పనలో భాగస్వామ్యం, ఆకర్షణీయ వేతనాలు వంటి అంశాలు వారిని ఆకట్టుకున్నాయి.

2025 జనవరి నాటికి సంస్థ భారత యూనిట్‌లో రెండో ఉద్యోగిని నియమించగా, అదే సంవత్సరం



చివరికి బృందం యాభై మందికి చేరింది. ప్రస్తుతం మంగళూరులోని కొట్టారా చౌక్‌లో ఆధునిక కార్యాలయం నుంచి అమెరికా మార్కెట్ కోసం కీలక సాఫ్ట్‌వేర్ అభివృద్ధి జరుగుతోంది. ఈ సంస్థ మాత్రమే కాకుండా, ఇటీవలి సంవత్సరాల్లో దక్షిణ కన్నడ, ఉడిపి జిల్లాల్లో వందలాది సమాచార సాంకేతిక సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించాయి.

గత రెండేళ్లలో ఈ ప్రాంత సమాచార సాంకేతిక ఆదాయం సుమారు రూ.3,200 కోట్ల నుంచి రూ.5,000 కోట్లకు పెరిగింది. అందులో సుమారు రూ.3,000 కోట్లు నిపుణుల వేతనాల రూపంలో స్థానిక ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తున్నాయి. 2034 నాటికి ఈ ప్రాంత ఐటి ఆదాయాన్ని రూ.45,000 కోట్లకు చేర్చడం, ఉద్యోగాల సంఖ్యను 50 వేల నుంచి 2 లక్షలకు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నారు. గత మూడేళ్లలోనే సుమారు 100 మిలియన్ డాలర్ల విలువైన అంతర్జాతీయ కొనుగోళ్లు జరగడం ఇక్కడి సాంకేతిక నాణ్యతకు నిదర్శనంగా నిలుస్తోంది.

ఇలా బెంగళూరుకు ప్రత్యామ్నాయంగా మంగళూరు ఎదుగుతుండటం దేశ సమాచార సాంకేతిక రంగంలో కొత్త దిశను సూచిస్తోంది.

## బంగారం ధరలపై నిర్మలా సీతారామన్ ఆసక్తికర వ్యాఖ్యలు



ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు భారీ స్థాయిలో పసిడి నిల్వలను కొనుగోలు చేస్తుండటమే అంతర్జాతీయ విపణిలో ధరలు ఎగసిపడటానికి ప్రధాన కారణమని ఆమె విశ్లేషించారు. కేంద్ర బ్యాంకుల ఈ ధోరణి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి పరిస్థితులను ప్రతిబింబిస్తోందని ఆమె అభిప్రాయపడ్డారు.

భారతీయ రిజర్వు బ్యాంకు కేంద్ర మండలి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, దేశీయ పరిస్థితులపై స్పష్టత ఇచ్చారు. భారత్‌లో బంగారం, వెండి దిగుమతులు ప్రస్తుతం ఆందోళన కలిగించే స్థాయిలో లేవని ఆమె భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ పరిణామాలు ఉన్నప్పటికీ దేశ ఆర్థిక స్థితి స్థిరంగా ఉందని పేర్కొన్నారు. దిగుమతి గణాంకాలను మరియు మార్కెట్‌లో నెలకొంటున్న మార్పులను భారతీయ రిజర్వు బ్యాంకు నిరంతరం పర్యవేక్షిస్తోందని, అవసరమైనప్పుడు తగిన చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అంతేకాకుండా, అమెరికా సంయుక్త రాష్ట్రాలు విధిస్తున్న సుంకాలలో మార్పుల ప్రభావాన్ని భారత ఆర్థిక వ్యవస్థపై తక్షణమే అంచనా వేయడం సరైనది కాదని ఆమె స్పష్టం చేశారు. అంతర్జాతీయ వాణిజ్య విధానాలు మారుతున్న వేళ భారతదేశం జాగ్రత్తగా ముందడుగు వేస్తోందని, దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా నిలిచేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రపంచ ఆర్థిక పరిణామాల మధ్య భారత్ సమతుల్య విధానాలతో ముందుకు సాగుతోందని మంత్రి వ్యాఖ్యానించారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గుజ్జుల రాంగోపాల్ రెడ్డి ని పరామర్శించిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

**వేలేరు, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**





వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన గుజ్జుల రామ్ గోపాల్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా, వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ రాంగోపాల్ రెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గుండ్రేడ్డి రాజేశ్వర్ రెడ్డి, మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాచర్ల కనకరాజు, కమ్మరిపేట సర్పంచ్ జోడుముంతలా కిరణ్,కొయ్యడా రాజు ,ఎండీ జానీ, సట్ల రవీందర్, కొలిపాక వెంకటేష్, సూత్రపు సంపత్, ఇట్టబోయిన సంపత్,కారం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# డాన్ బాస్కో పాఠశాల, పినపాక మొదటి అంతస్తు భవన విస్తరణ

◆ **ఆశీర్వాదం..ప్రారంభోత్సవం..**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు)**

తల్లాడ మండలంలోని పినపాక నందలి డాన్ బాస్కో పాఠశాల భవన మొదటి అంతస్తు విస్తరణ యొక్క ఆశీర్వాదం మరియు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమమును రెవ. ఫాదర్ థామస్ సాంతియాగు, ప్రొవిన్సియల్ ఆశీర్వాదంతో ప్రారంభించగా , యుగెండ్ ఐనే వెల్ట్, సి. ఇ. ఒ, మిస్టర్ రైన్హార్డ్ హైసెరర్, ఆస్ట్రియన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది, గురువులు, విద్యార్థుల తల్లి దండ్రులు, పాఠశాల పూర్వ విద్యార్థులు, సలేషియన్ సంస్థ సహకారులు, మఠవాసులు, శ్రేయోభిలాషులు మరియు సేలేసియన్ నిర్వహకులు పాల్గొన్నారు.

ఈ ప్రారంభోత్సవంలో భాగంగా, ముఖ్య అతిథులైన రెవరెండ్ ఫాదర్ తామస్ సాంతియాగో ని, యుగండ్ ఐనే వెల్ట్ ఆస్ట్రియా సీఈఓ గారైన మిస్టర్ రైనాల్డ్ హైసెరర్ ని, మిస్టర్ హారాల్డ్ సి భాహెర్ జేఈడబ్ల్యూ ని, ఫాదర్ నోయల్ ని, ఫాదర్ కిషోర్ ని, ఇంజినీర్ రాంబాబు ని, పాఠశాల ఉపాధ్యాయురాలు మని మేడం ని, పాఠశాల బాలల ప్రతినిధులైన మాస్టర్ డెనిస్ ని గౌరవప్రదంగా సన్మానించారు.

ఈ ఘన నిర్మాణంలో భాగస్తులైన అప్పర్ ఆస్ట్రియన్ గవర్నమెంట్ వారిని, డి కె ఎఫ్ ఎమ్ యెల్గా ముల్లర్ వారిని, మిస్సియోని డాన్ బోస్కో ఇటలీ, టూరిన్ వారిని, మిషన్ డాన్ బోస్కో, బాన్ జర్మనీ వారిని, డయో డియోసిస్ ఆఫ్ పాస్సవ్ వారిని, బిషప్ స్టీవెన్ ఓయిస్టర్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. మరి ముఖ్యంగా ఇందుకు తోడ్పడిన ఫాదర్ శరత్ ని, బ్రదర్ విన్సెంట్ కాస్తి కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అతిథులందర తమదైన శైలిలో సందర్భానుసారంగా సందేశాన్ని అందజేశారు. తదనంతరము విద్యార్థులందరు కన్నులకు విందుగా సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నృత్యాలతో ఆకట్టుకున్నారు. పాఠశాల డీన్ ఫాదర్ సుందర్ అందరికి వందన సమర్పణ చేశారు. అతిథులందరు పసందైన విందులో పాల్గొనిన పిదప ముగింపు పలికారు. ఈ కార్యక్రమాన్ని చక్కగా నడిపించిన పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ మరియు రెక్టర్ ఫాదర్ ప్రదీప్ కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

# మురారిపల్లిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల దుస్థితి

◆ **వారం రోజుల్లో పరిష్కారం లేకపోతే ప్రత్యక్ష కార్యాచరణ: ఎంపీ ఈటల రాజేందర్**

**మేడ్చల్–మల్కాజిగిరి, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**






మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని మురారిపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఈటల రాజేందర్ సందర్శించి అక్కడి పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను ఇక్కడికి రావడం ఐదవ సారి.ఎన్నిసార్లు చెప్పినా అధికారుల్లో స్పందన కనిపించడం లేదు" అని ఆయన విమర్శించారు.కాలనీలో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. నివాసితులకు కరెంట్ సౌకర్యం లేకపోవడం, డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేకపోవడం, మంచినీటి సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.అదనంగా, పలు సివిల్ పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఇళ్లు పూర్తిస్థాయిలో వినియోగించుకోలేని పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. కాలనీకి రవాణా సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల ప్రజలు రోజువారీ అవసరాల కోసం బయటకు వెళ్లడంలో కష్టాలు పడుతున్నారని వివరించారు. "ఇల్లు ఇచ్చినా ఉండడానికి అనువుగా లేకపోతే ప్రజల పరిస్థితి ఏమవుతుంది?" అని ప్రశ్నించిన ఎంపీ, వారం రోజుల్లోగా సమస్యలను పరిష్కరించాలని అధికారులను డిమాండ్ చేశారు. లేకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ప్రభుత్వం సమస్యలను పూర్తిగా పరిష్కరించే వరకు బాధితులకు అండగా ఉంటామని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు.

# వేలేరు మండలంలో యువతి అదృశ్యం..

◆ **కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**

**వేలేరు,ఫిబ్రవరి23(తెలంగాణ ముచ్చట్లు):**



వేలేరు మండలం షోడాషాపల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వేలేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కీర్తి శ్రావ్య (22), రాజు కుమార్తె, ప్రస్తుతం హన్మకొండలోని తనయ హాస్పిటల్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది.

ఇదే క్రమంలో శ్రావ్యకు ఆమె తల్లిదండ్రులు ఇటీవల పెళ్లి నిశ్చయించారు. అయితే సోమవారం నాడు ఆమె అకస్మాత్తుగా కనిపించకుండా పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమార్తెతో కలిసి హాస్పిటల్‌లో పనిచేస్తున్న సంజయ్ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు

# పీచర గ్రామంలో అక్రమ ఇసుక రవాణా అడ్డుకున్న పోలీసులు – ట్రాక్టర్ స్వాధీనం

**వేలేరు, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



వేలేరు మండలం పీచర గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని మరియు వ్యక్తిని వేలేరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఓర్సు కుమార్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా గుర్తించారు.

ఈ సందర్భంగా TS 03 UB 8099 నంబర్ గల మహేంద్ర 475 ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు వేలేరు ఎస్సై అజ్మీరా సురేష్ తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాంటి కార్యకలాపాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

# ఉమ్మడి జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు సిద్ధం కావాలి వేం నరేందర్ రెడ్డి పిలుపు

**_మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని దిశానిర్దేశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉమ్మడి జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలతో సోమవారం నిర్వహించిన కీలక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహాన్ని ఉమ్మడి జీహెచ్‌ఎంసీ పరిధిలోనూ కొనసాగించాలని సూచించారు.

మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమేనని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా ముందడుగు వేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఉప్పల్, మేడ్చల్, పటాన్‌చెరువు, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీలు మందుముల పరమేశ్వర్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్, కాట శ్రీనివాస్ గౌడ్, ఆవుల రాజిరెడ్డి వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పార్టీ అప్పగించిన బాధ్యతలను కార్యకర్తల నుంచి నాయకుల వరకు సమర్థవంతంగా నిర్వహించారని వేం నరేందర్ రెడ్డి అభినందించారు. అందరి సమిష్టి కృషి ఫలితంగానే మెజారిటీ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయ పతాకాన్ని ఎగురవేసిందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమన్వయం, క్రమశిక్షణతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# జీహెచ్‌ఎంసీపై కాంగ్రెస్ దృష్టి పార్టీ శ్రేణులకు వేం నరేందర్ రెడ్డి పిలుపు

◆ **మున్సిపల్ విజయోత్సాహాన్ని కొనసాగించాలి... సమిష్టి కృషితో విజయం సాధ్యమని సూచన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉమ్మడి జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలతో సోమవారం నిర్వహించిన కీలక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో సాధించిన విజయోత్సాహాన్ని ఉమ్మడి జీహెచ్‌ఎంసీ పరిధిలోనూ కొనసాగించాలని సూచించారు. మూడు కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం లక్ష్యంగా ముందుకు సాగాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేస్తే విజయాన్ని సాధించడం సాధ్యమేనని పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా ముందడుగు వేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఉప్పల్, మేడ్చల్, పటాన్‌చెరువు, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీలు మందుముల పరమేశ్వర్‌రెడ్డి, తోటకూర వజ్రేష్ యాదవ్, కాట శ్రీనివాస్ గౌడ్, ఆవుల రాజిరెడ్డి వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల సందర్భంగా పార్టీ అప్పగించిన బాధ్యతలను కార్యకర్తల నుంచి నాయకుల వరకు సమర్థవంతంగా నిర్వహించారని వేం నరేందర్ రెడ్డి అభినందించారు. అందరి సమిష్టి కృషి ఫలితంగానే మెజారిటీ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయ పతాకాన్ని ఎగురవేసిందని పేర్కొన్నారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమన్వయం, క్రమశిక్షణతో ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# బస్తీబాట కార్యక్రమంలో ప్రజల్లో మంచి స్పందన నెమలి అనిల్ కుమార్

**మల్లాపూర్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ మల్లాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ చేపట్టిన బస్తీబాట కార్యక్రమం ప్రజల్లో మంచి స్పందనను రాబడుతోంది. బస్తీల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు ప్రారంభిస్తున్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలు, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ లీకేజీలు, విద్యుత్ అంతరాయాలు, పారిశుద్ధ్య లోపాలు వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. ప్రతి సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ అభివృద్ధి కోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల మాటే మార్గదర్శకంగా తీసుకుని సేవా భావంతో ముందుకు సాగుతున్నామని నెమలి అనిల్ కుమార్ పేర్కొన్నారు. బస్తీబాట కార్యక్రమం కేవలం రాజకీయ పరిమితుల్లో కాకుండా, ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో నిర్వహిస్తున్న కార్యక్రమమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 'ప్రేరణ' ద్వారా ఆర్థిక సహాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):**

ఈ సంవత్సరం పదో తరగతి పూర్తి చేసి 80 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు శుభవార్త.

ప్రముఖ ఐటీ సంస్థకు అనుబంధమైన www.infosys.com/infosys foundation మద్దతుతో నడుస్తున్న 'ప్రేరణ' స్వచ్ఛంద సంస్థ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకొచ్చింది.

ఈ కార్యక్రమంలో భాగంగా అర్హులైన విద్యార్థులకు రాత పరీక్ష నిర్వహించనున్నారు. పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి వారి ఇంటర్ మరియు తదుపరి విద్యాభ్యాసానికి అవసరమైన ఆర్థిక సహాయం అందజేయబడుతుంది. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు.

దరఖాస్తు ఫారం పొందేందుకు సరస్వతి (9900906338), శివకుమార్ (99866 30301), బిందు (99645 34667)లను సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.అర్హులైన విద్యార్థులకు ఈ సమాచారం చేరేలా ప్రతి ఒక్కరూ తమ పరిచయ వర్గాల్లో పంచుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# రఫేల్ ఒప్పందంలో అడ్డంకులు

- సోర్స్ కోడ్‌లపై ఫ్రాన్స్ నిరాకరణ
- స్వదేశీ అనుసంధానంపై ప్రభావం
- మధ్యేమార్గంగా అనువర్తన అనుసంధానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** భారత్‌కు 114 రఫేల్ యుద్ధ విమానాల విక్రయం నేపథ్యంలో జరుగుతున్న చర్చల్లో కీలక సాంకేతిక అంశాలు ప్రధానంగా మారాయి. స్పెక్ట్రా ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థతో పాటు ఇతర కీలక ఎలక్ట్రానిక్ వ్యవస్థల కోసం అవసరమైన మూల సంకేతాలను బదిలీ చేయడాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ఫ్రాన్స్ అనుమతి లేకుండా భారత్ స్వతంత్రంగా కొన్ని సెన్సార్లు, ఆయుధాలను అనుసంధానం చేయడం లేదా విమాన నిర్వహణ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం కష్టమయ్యే పరిస్థితి ఏర్పడే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మూల సంకేతాలు అందుబాటులో లేకపోవడం వల్ల స్వదేశీ ఆయుధ వ్యవస్థలను వేగంగా అనుసంధానం చేయడం సాధ్యంకాలేదని, సమాచార అనుసంధాన సామర్థ్యాన్ని మెరుగుపరచలేకపోయిందని అమెరికా వైమానిక దళానికి చెందిన మాజీ ఉన్నతాధికారి డేవిడ్ డెప్టులా ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గతంలో జరిగిన సైనిక ఘర్షణ సమయంలో ఒక రఫేల్ విమానం నష్టపోవడానికి సాంకేతిక పరిమితులు కారణమై ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే పాకిస్థాన్‌తో జరిగిన ఘర్షణలో రఫేల్ విమానం నష్టాన్ని భారత్ అధికారికంగా అంగీకరించలేదు. 2025 జూలై 8న ఒక వ్యాపార వార్తా వాహినికి ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత రక్షణ కార్యదర్శి ఆర్‌కే సింగ్ స్పందిస్తూ రఫేల్ విమానాల గురించి బహువచనంలో మాట్లాడటం సరైంది కాదని తెలిపారు. ఈ వ్యాఖ్యలను విశ్లేషకులు ఒక విమానం నష్టం జరిగి ఉండొచ్చనే సంకేతంగా పరిగణిస్తున్నారు. మరోవైపు మూల సంకేతాలను యాజమాన్య ఉత్పత్తులుగా పరిగణిస్తూ, వాటిని ఇతర దేశాలతో పంచుకోలేమని ఫ్రాన్స్ స్పష్టం చేసినట్లు సమాచారం.

ఇలాంటి పరిస్థితుల్లో పూర్తి మూల సంకేతాల బదిలీకి బదులుగా అనువర్తన అనుసంధాన మార్గాన్ని పరిశీలించే అవకాశం ఉందని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. దీనిలో భాగంగా పూర్తి మూల సంకేతాల స్థానంలో అనువర్తన అనుసంధాన విధానాన్ని అందించే అవకాశముంది. దీని ద్వారా యాజమాన్య హక్కులు కాపాడుకుంటూనే భారత్ తన స్వదేశీ వ్యవస్థలను అనుసంధానం చేసుకునే వీలుంటుందని భావిస్తున్నారు. ఇదే విధానాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇప్పటికే అనుసరిస్తున్న దేశంగా గుర్తిస్తున్నారు.

# యువత చైతన్యం దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం

- చదువు కంటే బాధ్యత ముఖ్యమా?
- దేశభక్తి నినాదాల్లోనా? నిబద్ధతలోనా?
- విద్యార్థి శక్తి – సమాజ మార్పుకు మూలాధారం



**డెస్క్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థి జీవితం కేవలం పాఠ్యపుస్తకాల చదువుకే పరిమితం కాదు. అది ఆలోచనలకు ఆకారం ఇచ్చే దశ. వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే కాలం. రేపటి సమాజ నిర్మాణానికి పునాది వేసే దశ. ఈ సత్యాన్ని గుర్తు చేస్తూ జరుపుకునే సందర్భమే జాతీయ విద్యార్థి చైతన్య దినం. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, దేశభక్తి, చైతన్యాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ దినం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంది. చైతన్యం అంటే కేవలం ఆగ్రహం కాదు; అవగాహన. సమాజ సమస్యలను అర్థం చేసుకోవడం, వాటిపై స్పందించడం, సరైన మార్గాన్ని ఎంచుకోవడం. చదువు ద్వారా జ్ఞానం పొందిన విద్యార్థి సమాజాన్ని విశ్లేషించే సామర్థ్యం కలిగి ఉండాలి. ప్రశ్నించే ధైర్యం, చర్చించే సంస్కారం, న్యాయం కోసం నిలబడే నిబద్ధత ఇవే నిజమైన విద్యార్థి చైతన్యం. చైతన్యం ఉన్న యువతే సమాజాన్ని సానుకూల దిశగా నడిపించగలరు. దేశభక్తి అనేది కేవలం జెండా ఊపడం కాదు. అది దేశ ప్రయోజనాల పట్ల బాధ్యతాయుత ధోరణి. చట్టాలను గౌరవించడం, ప్రజా ఆస్తులను కాపాడడం, పన్నులు చెల్లించడం, ఓటు హక్కును వినియోగించడం ఇవి దేశభక్తి లక్షణాలు. విద్యార్థి దశలోనే ఈ విలువలు అలవాటు అయితే భవిష్యత్తులో సమగ్ర పౌరసత్వం బలపడుతుంది. దేశ నిర్మాణం నినాదాలతో కాదు; క్రమశిక్షణతో, నిబద్ధతతో సాధ్యమవుతుంది. సామాజిక బాధ్యత కూడా విద్యార్థి జీవితంలో కీలకం. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యువతలో మానవీయత పెరుగుతుంది. సమాజ సమస్యలపై చర్చించడం మాత్రమే కాకుండా, పరిష్కారాల కోసం కృషి చేయడం అవసరం. అక్షరాస్యత, ఆరోగ్య అవగాహన, గ్రామాభివృద్ధి వంటి రంగాల్లో విద్యార్థి శక్తి మార్పుకు దారి తీస్తుంది. నేటి డిజిటల్ యుగంలో సమాచారం అపారంగా అందుబాటులో ఉంది. కానీ సరైన దిశలో ఆలోచించే చైతన్యం అవసరం. అపోహలు, తప్పుడు ప్రచారం యువతను దారి తప్పించే ప్రమాదం ఉంది. అందుకే విమర్శనాత్మక దృక్పథం పెంపొందించాలి. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలి. నిజానిజాలను తెలుసుకునే అలవాటు పెంపొందించాలి. చరిత్రలో అనేక సామాజిక ఉద్యమాలు యువతతోనే ప్రారంభమయ్యాయి. విద్యార్థి శక్తి ఎప్పుడూ మార్పుకు సంకేతం. వారి ఆలోచనలు, వారి స్పందన దేశ దిశను ప్రభావితం చేస్తాయి. కానీ ఆ శక్తి సరైన దిశలో ప్రయాణించాలంటే విలువల పునాది అవసరం. క్రమశిక్షణ, సహనం, పరస్పర గౌరవం, న్యాయబద్ధత ఇవి విద్యార్థి జీవితంలో భాగం కావాలి. విద్యాసంస్థలు కూడా ఈ దిశగా బాధ్యత వహించాలి. పాఠ్యాంశాలతో పాటు విలువల విద్య, చర్చా వేదికలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులు కేవలం పరీక్షల ఫలితాల కోసం కాకుండా సమాజ ప్రయోజనాల కోసం ఆలోచించేలా ప్రోత్సహించాలి. కుటుంబాలు కూడా యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యతను పెంపొందించాలి. మొత్తంగా జాతీయ విద్యార్థి చైతన్య దినం ఒక గుర్తింపు మాత్రమే కాదు; ఒక పిలుపు. చదువు ద్వారా జ్ఞానం పొందిన యువత సమాజాన్ని అర్థం చేసుకుని, బాధ్యతతో వ్యవహరించాలి. దేశభక్తి నినాదాల్లో కాకుండా కార్యాచరణలో కనిపించాలి. విద్యార్థి శక్తి చైతన్యంతో ముందుకు సాగితే దేశ భవిష్యత్తు బలపడుతుంది. యువతలో అవగాహన, నిబద్ధత పెరిగితే సమాజం సమగ్ర అభివృద్ధి దిశగా ప్రయాణిస్తుంది. సామాజిక బాధ్యత కూడా విద్యార్థి జీవితంలో భాగం కావాలి. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలు, అక్షరాస్యత ఉద్యమాలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా యువతలో మానవీయత పెరుగుతుంది. సమాజ సమస్యలపై స్పందించడం, చర్చించడం, పరిష్కారాల కోసం కృషి చేయడం విద్యార్థి చైతన్యానికి సంకేతం.నేటి సాంకేతిక యుగంలో సమాచారం అపారంగా అందుబాటులో ఉంది. కానీ సరైన దిశలో ఆలోచించే చైతన్యం అవసరం. తప్పుడు ప్రచారం, అపోహలకు లోనుకాకుండా విమర్శనాత్మక దృక్పథం పెంపొందించాలి. విద్యార్థులు సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలి. అవగాహనతో వ్యవహరించాలి. విద్యార్థి శక్తి ఎప్పుడూ సమాజ మార్పుకు ప్రేరణగా నిలిచింది. చరిత్రలో అనేక ఉద్యమాలు యువతతోనే ప్రారంభమయ్యాయి. చైతన్యం ఉన్న విద్యార్థులు సమాజంలో సానుకూల మార్పులకు నాంది పలుకుతారు. వారి ఆలోచనలు దేశ దిశను ప్రభావితం చేస్తాయి. మొత్తంగా జాతీయ విద్యార్థి చైతన్య దినం ఒక స్ఫూర్తి దినం. విద్యార్థులు తమ పాత్రను గుర్తించాలి. చదువు, క్రమశిక్షణతో పాటు సామాజిక బాధ్యతను అలవాటు చేసుకోవాలి. దేశాభివృద్ధి కోసం చైతన్యంతో ముందుకు రావాలి. యువతలో చైతన్యం పెరిగితే దేశ భవిష్యత్తు బలపడుతుంది.

# తూర్పు సిక్కింలో హిమపాతం

- 46 మంది పర్యాటకుల రక్షణ
- ‘ఆపరేషన్ హిమ్రాహత్’తో భారత సైన్యం వేగవంతమైన చర్యలు
- మైనస్ ఉష్ణోగ్రతల్లో చిక్కుకున్న వాహనాలు, ప్రయాణికులు
- సైనిక శిబిరంలో వైద్య సహాయం, తాత్కాలిక వసతి



**తూర్పు సిక్కిం, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** తూర్పు సిక్కింలో భారీ హిమపాతం కారణంగా చిక్కుకుపోయిన 46 మంది పర్యాటకులను భారత సైన్యం సురక్షితంగా కాపాడింది. ‘ఆపరేషన్ హిమ్రాహత్’ పేరుతో చేపట్టిన సహాయక చర్యలు విజయవంతమయ్యాయని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లో సైన్యం వేగంగా స్పందించి పర్యాటకులను రక్షించింది.

నిన్న ఎత్తైన ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీగా మంచు కురిసింది. ఉష్ణోగ్రతలు మైనస్ స్థాయికి పడిపోవడంతో పలు మార్గాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పర్యాటకుల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో సహాయం కోసం సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే ఆ ప్రాంతంలోని సైనిక బృందాలు రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. చిక్కుకుపోయిన పర్యాటకులను సమీప సైనిక శిబిరానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. వెచ్చని దుస్తులు, వేడి భోజనం, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించారు. అందరి ఆరోగ్యం సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తరువాతనే వారి ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ప్రమాదకర పరిస్థితుల్లో నిలిచిపోయిన 150కి పైగా వాహనాలను కూడా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో భారత సైన్యం అందించే మానవతా సహాయక చర్యలకు ‘ఆపరేషన్ హిమ్రాహత్’ మరో ఉదాహరణగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు.

# పన్నుల వ్యవస్థ దేశ ఆర్థిక స్థిరత్వానికి ఆధారం

- ఆదాయ వనరులు లేకుండా అభివృద్ధి సాధ్యమా?
- బాధ్యతాయుత పన్ను చెల్లింపులు – ప్రజాస్వామ్య బలానికి సంకేతం
- పారదర్శకత, క్రమశిక్షణ – ఆర్థిక వ్యవస్థకు శక్తి

**డెస్క్, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** దేశ నిర్మాణంలో పన్నుల వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. పన్నులు ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరు. ఈ ఆదాయ ద్వారానే రహదారులు, వంతెనలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, నీటి సరఫరా వ్యవస్థలు, రక్షణ రంగం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలులోకి వస్తాయి. పన్నుల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ జరుపుకునే సందర్భమే కేంద్ర ఉత్పత్తి సుంక దినం. ఇది కేవలం ఒక అధికారిక దినం మాత్రమే కాదు; ఆర్థిక బాధ్యతను గుర్తుచేసే సందర్భంగా నిలుస్తుంది. ఉత్పత్తి సుంకం దేశ ఆర్థిక చరిత్రలో కీలక భాగం. పరిశ్రమల ద్వారా ఉత్పత్తి అయ్యే వస్తువులపై విధించే సుంకం ద్వారా ప్రభుత్వ ఖజానా బలపడుతుంది. ఈ నిధులు సామాజిక సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సేవల విస్తరణకు ఉపయోగపడతాయి. ఆదాయ వనరులు బలంగా ఉంటేనే ప్రభుత్వం దీర్ఘకాల అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయగలదు.


పన్నులు చెల్లించడం కేవలం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాదు; అది పౌర కర్తవ్యం. అభివృద్ధి ఫలితాలను అందరూ అనుభవిస్తారు. కాబట్టి ఆ అభివృద్ధికి అవసరమైన నిధులను సమకూర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత. పన్ను చెల్లింపులపై అవగాహన పెరిగితే ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది. పన్నులు సక్రమంగా వినియోగించబడుతున్నాయన్న నమ్మకం ప్రజల్లో పెరిగితే చెల్లింపుల పట్ల సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. పన్నుల వ్యవస్థలో పారదర్శకత అత్యంత ముఖ్యమైనది. ఆదాయం ఎలా సమకూరుతోంది? ఎలా వినియోగించబడుతోంది? అన్న అంశాల్లో స్పష్టత అవసరం. పారదర్శకత పెరిగితే ప్రజల్లో విశ్వాసం బలపడుతుంది. అవినీతి, ఎగవేతలను నియంత్రించడానికి కఠిన చర్యలు అవసరం. సాంకేతిక వనరుల వినియోగం ద్వారా పన్ను పరిపాలన సరళీకృతమవుతోంది. ఇది ప్రజలకు సౌలభ్యాన్ని కల్పిస్తోంది.

దేశ ఆర్థిక స్థిరత్వానికి క్రమశిక్షణ అవసరం. ఆదాయం, వ్యయం మధ్య సమతుల్యత ఉండాలి. పన్నుల ద్వారా సమకూరే నిధులు సమర్థంగా వినియోగించబడితేనే అభివృద్ధి ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయి. మౌలిక వసతులు మెరుగుపడితే పెట్టుబడులు పెరుగుతాయి. పెట్టుబడులు పెరిగితే ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయి. ఈ చక్రం పన్నుల వ్యవస్థ బలంపై ఆధారపడి ఉంటుంది. కేంద్ర ఉత్పత్తి సుంక దినం ఒక సందేశాన్ని ఇస్తుంది. అభివృద్ధి ఒక సమిష్టి ప్రయాణం. ప్రభుత్వం, పరిశ్రమలు, పౌరులు కలిసి పనిచేస్తేనే ఆర్థిక పురోగతి సాధ్యమవుతుంది. పన్నుల చెల్లింపు, సమర్థ వినియోగం, పారదర్శకత ఇవి దేశ బలానికి మూలాధారాలు. మొత్తంగా పన్నుల వ్యవస్థ దేశ నిర్మాణానికి అస్తివారంగా నిలుస్తుంది. ఆదాయ వనరులు సక్రమంగా సమకూరితేనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా సాగుతాయి. కేంద్ర ఉత్పత్తి సుంక దినం పన్నుల ప్రాధాన్యాన్ని, పౌర బాధ్యతను, ఆర్థిక క్రమశిక్షణ అవసరాన్ని గుర్తు చేసే సందర్భంగా నిలుస్తుంది. అభివృద్ధి ఫలితాలను అందరూ అనుభవించాలంటే పన్నుల వ్యవస్థ బలంగా ఉండాలి అన్న సత్యాన్ని ఈ దినం మళ్ళీ మనకు గుర్తుచేస్తుంది. పన్నులు చెల్లించడం ఒక పౌర బాధ్యత. అభివృద్ధి ఫలితాలను పొందాలంటే ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలి. పన్ను చెల్లింపులపై అవగాహన పెంపొందించడం అవసరం. పారదర్శక వ్యవస్థ ఉంటే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. పన్ను వసూళ్లు సమర్థంగా వినియోగించబడితే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది.

పన్నుల వ్యవస్థలో పారదర్శకత, సరళీకరణ అవసరం. పన్ను చెల్లింపులు సులభంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. అవినీతి, ఎగవేతలను నియంత్రించాలి. సాంకేతిక వనరుల వినియోగంతో పన్నుల పరిపాలన మెరుగుపడుతోంది. ఇది ప్రజలకు సౌలభ్యాన్ని అందిస్తోంది. కేంద్ర ఉత్పత్తి సుంక దినం ఆర్థిక క్రమశిక్షణ ప్రాముఖ్యతను గుర్తు చేస్తుంది. అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు; పౌరుల సహకారం కూడా అవసరం. సమిష్టి కృషితోనే దేశ ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుంది.

మొత్తంగా పన్నుల వ్యవస్థ దేశ నిర్మాణానికి బలమైన ఆధారం. ఆదాయ వనరులు సక్రమంగా సమకూరితేనే అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరంగా సాగుతాయి. కేంద్ర ఉత్పత్తి సుంక దినం పన్నుల ప్రాధాన్యాన్ని, పౌర బాధ్యతను గుర్తు చేసే సందర్భంగా నిలుస్తుంది.

# రూ.7 కోట్ల సైబర్ మోసం కేసులో ఇరుక్కున్న విద్యార్థి



- బ్యాంక్ ఖాతా వివరాలు ఇచ్చిన అమాయకపు నిర్ణయం భారీ మూల్యం
- నెట్ బ్యాంకింగ్ వివరాలు, సిమ్ కార్డు అందజేతతో అనుమానాస్పద లావాదేవీలు
- సైబర్ పోలీసుల దర్యాప్తు ముమ్మరం

**బెంగళూరు, ఫిబ్రవరి 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఆపదలో ఆదుకున్నవాడే అసలైన స్నేహితుడని భావించిన ఓ ఇంజనీరింగ్ విద్యార్థి, తన నమ్మకంతోనే రూ.7 కోట్ల సైబర్ మోసం కేసులో ప్రధాన నిందితుడిగా నిలిచే పరిస్థితి ఎదుర్కొన్నాడు. బెంగళూరులోని ఒక ప్రముఖ కళాశాలలో చదువుతున్న ఈ విద్యార్థి, తన స్నేహితుడి అభ్యర్థనను నమ్మి బ్యాంక్ ఖాతా వివరాలు ఇవ్వడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. విద్యార్థికి ‘ఆయుష్’ అనే వ్యక్తితో ఏడాది కాలంగా పరిచయం ఉన్నట్లు సమాచారం. గత సంవత్సరం నవంబరులో ఆయుష్ తన బ్యాంక్ ఖాతా నిలిపివేయబడిందని, అత్యవసర లావాదేవీల కోసం ఖాతా అవసరమని చెప్పడంతో, స్నేహితుడే కదా అని నమ్మిన విద్యార్థి కర్ణాటక గ్రామీణ బ్యాంకులోని తన ఖాతా వివరాలు అందజేశాడు. నెట్ బ్యాంకింగ్ వినియోగదారు గుర్తింపు సంఖ్య, సంకేతపదం ఇవ్వడమే కాకుండా, ఖాతాకు అనుసంధానమైన సిమ్ కార్డును కూడా కొరియర్ ద్వారా పంపినట్లు వెల్లడైంది. కొన్ని నెలల తరువాత బ్యాంక్ అధికారులు సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. అతడి ఖాతా ద్వారా సుమారు రూ.7 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ మొత్తం సైబర్ నేరాల ద్వారా దోచుకున్న డబ్బుగా భావిస్తున్నారు. షాక్‌కు గురైన విద్యార్థి వెంటనే బెంగళూరు ఉత్తర విభాగ సైబర్ నేరాల పోలీసులను ఆశ్రయించాడు. ఆయుష్‌తో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు, లేదా ఖాతాకు అనుసంధానమైన సిమ్ కార్డులను ఎవరితోనూ పంచుకోవడం చట్టరీత్యా నేరమే కాక ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. ఖాతా ద్వారా జరిగే లావాదేవీలకు ప్రాథమిక బాధ్యత ఖాతాదారుడిపైనే ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## 'జన నాయగన్' విడుదల ఎప్పుడు?.. విజయ్ పుట్టినరోజు లక్ష్యంగా ప్రణాళికలా!

కోలీవుడ్ ప్రముఖ హీరో విజయ్ చివరి చిత్రంగా భావిస్తున్న 'జన నాయగన్' విడుదలపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. సంక్రాంతి సందర్భంగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం సెన్సార్ వివాదాల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి విడుదల తేదీపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విదేశాల్లో భారతీయ చిత్రాలను విడుదల చేసే యార్క్ సినిమాస్ సంస్థ ప్రకటనతో ఏప్రిల్ 30లోపు ఈ సినిమా విడుదల కాదని స్పష్టత వచ్చింది. దీంతో కొత్త తేదీపై చిత్రబృందం ఆలోచనలో పడినట్లు సమాచారం. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తల ప్రకారం, విజయ్ 52వ పుట్టినరోజు సందర్భంగా జూన్ 22ను దృష్టిలో ఉంచుకుని జూన్ 18న సినిమాను విడుదల చేయాలని మేకర్లు భావిస్తున్నారట. ఆ రోజు గురువారం కావడంతో పాటు దీర్ఘ వారాంతం కలిసివచ్చే అవకాశం ఉండటంతో ఆ తేదీ అనుకూలమని విశ్లేషిస్తున్నారు. అయితే దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు. సినిమా సెన్సార్ ప్రక్రియలో చోటుచేసుకున్న పరిణామాలు విడుదల ఆలస్యానికి ప్రధాన కారణమయ్యాయి. మొదట చిత్రానికి యూ/ఏ ధ్రువీకరణ ఇచ్చిన సెన్సార్ మండలి, తరువాత సవరణ సంఘానికి పంపాలని సూచించింది. దీనిపై చిత్రబృందం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఒకే న్యాయమూర్తి పీఠంలో తాత్కాలిక ఉపశమనం లభించినప్పటికీ, విభాగీయ పీఠంలో అనుకూల తీర్పు రాలేదు. అనంతరం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించినా, అదే విభాగీయ పీఠంలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించడంతో మేకర్లు కేసును వెనక్కి తీసుకుని సవరణ సంఘానికి చిత్రాన్ని పంపాలని నిర్ణయించారు. ప్రస్తుతం ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయ్యాకే విడుదల తేదీపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఈ చిత్రానికి హెచ్ వినోద్ దర్శకత్వం వహించారు. విజయ్ సరసన పూజా హెగ్డే కథానాయికగా నటించగా, యువ నటి మమిత బైజు విజయ్ కుమార్తె పాత్రలో కనిపించనున్నారు. కీలక పాత్రల్లో బాబీ డియోల్, నరైన్, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రియమణి, ప్రకాశ్ రాజ్ నటిస్తున్నారు. చిత్రం విడుదలపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పుట్టిన రోజు కానుకగా 'జన నాయగన్' వస్తుందా లేదా అన్నది త్వరలో తేలనుంది.



## నెగెటివిటీపై సమంత ఆగ్రహం.. "బ్లాక్ లిస్టులో పెడతా"

స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తూ స్వయంగా నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.
చిత్రబృందం అధికారికంగా విడుదల తేదీని ప్రకటించగా, ఈ వేసవి కానుకగా మే 15న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.
ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు వేగంగా సాగుతున్నాయి.
ప్రచారంలో భాగంగా అభిమానులతో ముచ్చటించిన సమంత, తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న విమర్శలు, నెగెటివ్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. తన వ్యక్తిగత విషయాల్లోకి జోక్యం చేసుకుంటూ ఉద్దేశపూర్వకంగా నెగెటివిటీ పంచే వారిని ఏమాత్రం సహించబోనని స్పష్టం చేశారు. అలాంటి వారిని వెంటనే తన సామాజిక మాధ్యమ ఖాతాల్లో 'బ్లాక్ లిస్టు'లో పెడతానని వెల్లడించారు. ఎవరినైనా తాను బ్లాక్ చేస్తే, వారు తనను బాధపెట్టారని కాదు, తన ప్రపంచంలోకి వారికి ప్రవేశం లేదని అర్థమని ఆమె వ్యాఖ్యానించారు. ప్రశంసలు తనను అతిగా ప్రభావితం చేయవని, విమర్శలు కూడా తనను కుంగదీయలేవని తెలిపారు. తన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటానో, తన సామాజిక మాధ్యమ పేజీని కూడా అలాగే స్వచ్ఛంగా ఉంచుకోవాలని భావిస్తానని పేర్కొన్నారు.
సోషల్ మీడియాలో హద్దులు దాటి ప్రవర్తించే ట్రోలర్లకు సమంత వ్యాఖ్యలు గట్టి హెచ్చరికగా మారాయి. ప్రస్తుతం 'మా ఇంటి బంగారం' చిత్రంపై సినీప్రియుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమా విడుదల తర్వాత సమంతకు మరింత విజయాన్ని తీసుకురాగలదా అన్న చర్చ సినీ వర్గాల్లో సాగుతోంది.

## విజయ్ సేతుపతి–సాయిపల్లవి జంట రాబోతోంది.. పూర్తి వివరాలు ఇవే





తమిళ చిత్రసీమలో అగ్ర దర్శకుడిగా పేరుగాంచిన మణిరత్నం దర్శకత్వంలో కొత్త ప్రేమకథా చిత్రం రూపుదిద్దుకోనుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర కోసం తొలుత శింబు, ధ్రువ్ విక్రమ్ వంటి నటుల పేర్లు వినిపించినప్పటికీ, చివరికి కోలీవుడ్ స్టార్ నటుడు విజయ్ సేతుపతిను ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం చిత్ర వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించింది.
ఈ చిత్రంలో కథానాయికగా సహజ నటి సాయిపల్లవి నటించనుంది. భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇచ్చే ప్రేమ కథగా ఈ చిత్రం తెరకెక్కనుందని తెలుస్తోంది. ఇప్పటికే సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ స్వరపరచిన కొన్ని గీతాల పనులు పూర్తయ్యాయని సినీ వర్గాల సమాచారం. కథ, సంగీతం, నటీనటుల ఎంపిక ఇలా అన్నింటిలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.
విజయ్ సేతుపతి ప్రస్తుతం అనేక చిత్రాలతో బిజీగా ఉన్నాడు. అవి పూర్తయ్యిన వెంటనే ఈ చిత్రాన్ని ప్రారంభించేందుకు మణిరత్నం సిద్ధమవుతున్నారని సమాచారం. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.
ఇక మణిరత్నం గతంలో విడుదలైన చిత్రం పెద్దగా ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయిన నేపథ్యంలో, ఈసారి ప్రేక్షకులను ఆకట్టుకునేలా బలమైన కథతో ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. విజయ్ సేతుపతి తన వైవిధ్యమైన నటనతో పాత్రలకు ప్రాణం పోసే నటుడిగా పేరుపొందాడు. సాయిపల్లవి సహజమైన నటన, నృత్య ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు పొందింది. వీరిద్దరి జంటగా తెరకెక్కే ఈ ప్రేమకథపై ఇప్పటికే సినీప్రియుల్లో భారీ ఆసక్తి నెలకొంది.
త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముంది.

## మరో విజయంపై కన్నేసిన చిట్టి..



సినిమా రంగంలో అందం, అభినయం ఉన్నా అదృష్టం కలిసిరాని కథానాయికలు చాలామంది ఉన్నారు. అలాంటి వారిలో ఫరియా అబ్దుల్లా ఒకరు. చేసింది కొద్ది సినిమాలే అయినా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. కానీ ఆశించిన స్థాయిలో అవకాశాలు, విజయాలు మాత్రం అందుకోవడంలో వెనుకబడి పోతోంది. జాతిరత్నాలు సినిమాతో కథానాయికగా పరిచయమైన ఫరియా, తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ చిత్రంలో ఆమె చూపిన అమాయకత్వం, సహజ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలి విజయంతో వరుస అవకాశాలు అందుకున్నా, తర్వాతి చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి. తర్వాత చేసిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన రీతిలో ఆడలేదు. మత్తు వదలరా 2 లో శ్రీ సింహ తో కలిసి నటించి కొంతమేర మెప్పించింది. అయితే ఆ తరువాత వచ్చిన చిత్రాలు వరుసగా నిరాశపరిచాయి. దీంతో మరో గట్టి విజయాన్ని అందుకోవాలనే తపనతో కథల ఎంపికలో మరింత జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. కథానాయికగానే కాకుండా ప్రత్యేక గీతాల్లోనూ ఆమె ప్రేక్షకులను మెప్పించింది. బంగార్రాజు చిత్రంలో ప్రత్యేక గీతంతో ఆకట్టుకుంది. అలాగే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ లో అఖిల్ అక్కినేని తో, ఒక రాజు ఒక రాణి లో నవీన్ పొలిశెట్టి తో అతిథి పాత్రల్లో కనిపించింది. చివరిగా గుర్రం పాపిరెడ్డి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా అది కూడా ఆశించిన విజయాన్ని అందించలేదు. అయితే సామాజిక మాధ్యమాల్లో మాత్రం ఫరియా చురుకుగా ఉంటూ అభిమానులతో అనుసంధానం కొనసాగిస్తోంది. ఆకర్షణీయ చిత్రాలతో ఎప్పటికప్పుడు సందడి చేస్తూ తనకంటూ ప్రత్యేక అభిమాన వర్గాన్ని ఏర్పరుచుకుంటోంది. ఇప్పుడు మరో బలమైన కథతో ప్రేక్షకుల ముందుకు రావాలనే సంకల్పంతో ప్రయత్నాలు ముమ్మరం చేసింది ఫరియా అబ్దుల్లా. సరైన కథ, సరైన అవకాశం దొరికితే మరోసారి పెద్ద విజయాన్ని అందుకోవాలని ఈ చిట్టి ఆశగా ఎదురుచూస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in